సాక్షి
మంచిర్యాల
గురువారం । 18 । మే । 2023



మూగజీవాలు విలవిల

ఎండల తీవ్రతకు మూగజీవాలూ విలవిలలాడుతున్నాయి. చెట్ల నీడన, నీటిమడుగుల్లో సేదదీరుతున్నాయి. యజమానులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో▸



క్రీడలతో మంచి భవిష్యత్

జిల్లాలో పలు మండలాల్లో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల, బెల్లంపల్లి, శ్రీరాంపూర్, భీమిని మండలాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
42.0 /28.0

వాతావరణం

ఉదయం వేళ ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

ఎండల్లో జర భద్రం..!

• జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు • వడగాలుల నుంచి రక్షణ పొందాల్సిందే



మంచిర్యాలలోని ఓవర్‌బ్రిడ్జిపై బుధవారం సాయంత్రం 4:10 గంటలకు నిర్మానుష్యం

మంచిర్యాలటౌన్: జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. 45 డిగ్రీల వరకు నమోదు అవుతుండడంతోపాటు వడగాలులు వీస్తుండడంతో మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకే ఎండలు తారెత్తిస్తుండడంతో బయటకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. అత్యవసర పనులు ఉన్నవారు బయటకు వెళ్లిన సమయంలో రక్షణగా గొడుగులు, టోపీలు ధరించి, తలకు టవల్స్, చున్నీలు చుట్టుకుని వెళ్తున్నారు. సాయంత్రం 5గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది.

జాగ్రత్తలు పాటించాల్సిందే..



– డాక్టర్ అభినవ్, ఎండీ జనరల్ ఫిజీషియన్, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

- ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే పిల్లలను ఆడుకునేందుకు బయటకు వెళ్లనివ్వాలి.
- వేసవిలో కాటన్ దుస్తులు ధరించడం ఎంతో సౌకర్యంగా ఉంటుంది.
- ఎండలో తప్పక ప్రయాణం చేసేవారు చెవులకు రుమాలు కట్టుకుని, టోపీ పెట్టుకోవాలి.
- వడదెబ్బతో విపరీతమైన తలనొప్పి. వాంతులు, శరీర ఉష్ణోగ్రత పెరిగి జ్వరం వచ్చి, శరీరం శక్తిని కోల్పోతుంది. అత్యవసరం అనిపిస్తే వైద్యుడిని తప్పకుండా సంప్రదించాలి.
- ఎండలో తిరిగితే ముక్కు నుంచి రక్తం కారుతుంది.
- వేడి వల్ల చెమట శరీరం నుంచి వెళ్లడంతో సోడియం, పొటాషియం, ఎలక్ట్రోలెవల్ తగ్గిపోతాయి. కొబ్బరినీళ్లు, పండ్ల రసాలు, ఎలక్ట్రోపౌడర్ లేదా ఉప్పు, చక్కర కలిపిన నీటిని బాగా తాగితే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.
- వేసవిలో దప్పిక ఎక్కువగా అవుతుందని ఎక్కడపడితే అక్కడ నీళ్లు తాగరాదు.
- కలుషిత నీరు తాగడం వల్ల అతిసార వ్యాధి ప్రబలే ప్రమాదం ఉంది. ప్రయాణం సమయంలో ఇంటి నుంచి నీటిని తీసుకెళ్లాలి. లేదంటే ఐఎస్ఐ మార్క్ ఉన్న కంపెనీ నీటిని కొనుక్కుని తాగాలి.
- నిల్వ పదార్థాలను వేసవిలో తినకపోవడమే మంచిది.

రాత్రి అన్నం, కూరలను ఎట్టి పరిస్థితిలో తెల్లవారి తినకూడదు.

- ఐస్‌క్రీంలు, కుల్ఫీలు కలుషిత నీటితో తయారు చేసే అవకాశం ఉన్నందున పిల్లలకు అవి తినిపించక పోవడమే మంచిది. కూల్‌డ్రింక్స్‌తోపాటు బయట దొరికే టెట్రా ప్యాకెట్లు తాగొద్దు. టెట్రా ప్యాకెట్లపై ఓఆర్ఎస్ కాదని రాసి ఉంటుంది. ఓఆర్ఎస్ ప్యాకెట్ ఒకదానిని ఒక లీటర్ నీటిలో కలిపిన తరువాత 12 గంటల్లోపు తాగాలి.
- అతిగా వేడి ఉన్న సమయంలో వాకింగ్, వ్యాయామం చేయకపోవడం మంచిది. ఇంట్లోనే కొంత వరకు వ్యాయామం చేసుకోవాలి.
- ఏసీలో ఉండి నేరుగా ఎండలోకి వెళ్లడం, ఎండ నుంచి నేరుగా ఏసీలోకి వెళ్లడం చేయవద్దు.
- మాంసాహారం, జంక్‌ఫుడ్, ఫ్రై చేసిన కూరలు, కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. షుగర్, బీపీ ఉన్నవారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇంట్లో ఉంటేనే మంచిది



– డాక్టర్ వనిత, గైనకాలజిస్టు, మాతా శిశు ఆరోగ్య కేంద్రం, మంచిర్యాల

- గర్భిణులు, ప్రసవం అయిన బాలింతలు ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా ఉంటే మంచిది.
- వేడి గాలి తగలకుండా, చల్లని ప్రదేశంలో ఉండేలా చూడాలి.
- గర్భిణులు దాహం వేయక పోయినా, నీటిని కొద్దికొద్దిగా తాగుతూ ఉండాలి. కడుపులో ఉన్న శిశువుకు ఉమ్మనీరు సరిపడా ఉండేలా చూసుకోవాలి.
- కొబ్బరి నీటితోపాటు నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లు తింటుండాలి.
- ప్రసవం అయిన వారు ఈ వేడికి వేసిన కుట్లు మానేందుకు సరైన ఆహారం తీసుకోవడంతోపాటు తగినన్ని నీటిని తాగాలి. కొబ్బరి నీరు తప్పనిసరిగా తీసుకోవాలి.
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు రాకుండా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతోపాటు ద్రవ పదార్థాలు తీసుకోవాలి.
- ఎండలో వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తాగునీరు ఎక్కువగా తీసుకోవాలి.

జాగ్రత్తలతో 'మంట'కు చెక్

• వేసవిలో అప్రమత్తత అవసరం
• అగ్నిమాపక అధికారి బి.అజయ్‌కుమార్



అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వేసవిలో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. చిన్నపాటి నిర్లక్ష్యం, అజాగ్రత్తలతో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరగవచ్చు. జిల్లాలో ఎండలు మండుతున్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు రాకుండా నివారించవచ్చని జిల్లా అగ్నిమాపక అధికారి బండి అజయ్‌కుమార్ తెలిపారు. జిల్లా ప్రజలకు పలు సూచనలు చేశారు.

- పత్తి, ధాన్యం రాశులు, గడ్డివాములు వీలైనంత వరకు ఇంటికి సమీపంలో నిల్వ చేయొద్దు. సాగు భూముల్లో పంట వ్యర్థాలు కాల్చొద్దు.
- వేసవిలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, ఫ్రిడ్జీలు, తదితరవి ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో అధిక లోడ్‌తో వైర్లు కాలిపోయే అవకాశం ఉంది. కాసేపు విరామం ఇస్తూ వాడితే వేడిమి తగ్గించుకోవచ్చు. వైర్లు పాడైపోయినవి, పాతవి, నాణ్యత లేనివి వాడొద్దు. ఇంట్లో విద్యుత్ పరికరాలను ఒకేసారి వాడొద్దు.
- గ్యాస్ సిలిండర్లు లీకేజీ కాకుండా చూసుకోవాలి. గ్యాస్ కనెక్షన్ పైపులు, పొయ్యి తరచూ చెక్ చేసుకోవాలి. వంటిల్లు తగిన వెంటిలేషన్ ఉండాలి. గాలి ఎక్కువగా వచ్చేలా చూసుకోవాలి.
- సిగరెట్లు, బీడీలు కాల్చి పూర్తిగా ఆర్పకుండానే ఎక్కడపడితే అక్కడ వేస్తే ప్రమాదాలకు కారణమవుతాయి. అటవీ, వ్యవసాయ క్షేత్రాల్లో ప్రమాదాలు ఎక్కువ జరిగే ఆస్కారం ఉంది.
- వాహనాలను క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేస్తే ప్రమాదాలు జరగవు.
- అగ్నిప్రమాదం జరిగితే వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. ఫోన్‌లో మాట్లాడినప్పుడు ఫైర్ అధికారులు చెప్పినట్లుగా చేసి, ప్రమాదం తగ్గించాలి.

అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు

టోల్ ఫ్రీ నంబరు 101
మంచిర్యాల: 8712699194
బెల్లంపల్లి: 8712699198
జన్నారం: 8712699196
చెన్నూరు: 8712699200

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: 'ధాన్యం ..దైన్యం' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ స్పందించారు. మందమర్రి మండలం సారంగపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. కేంద్రంలో ధాన్యం ఆరబోసిన రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ధాన్యం ఆరబోసి నెల రోజులవుతున్నా ఇంతవరకు గింజ కూడా కొనుగోలు చేయలేదని, వడ్లు వర్షానికి తడుస్తున్నాయని, తీవ్రమైన ఎండకు తట్టుకోలేక కొందరు తక్కువ ధరకు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ కొనుగోలు కేంద్రానికి వెంటనే లారీలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు.

ధాన్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తొద్దు



మాట్లాడుతున్న మధుసూదన్‌నాయక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ చాంబర్ నుంచి మంచిర్యాల ఆర్డీవో వేణుతో కలిసి తహసీల్దార్లు, రైస్‌మిల్లర్లు, ధాన్యం కొనుగోలు ఏజెన్సీలు, పాడి కాంట్రాక్టర్లతో ధాన్యం కొనుగోలు, యాసంగి అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తహసీల్దార్లు తమ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలని, రైస్‌మిల్లర్లు ధాన్యం కేంద్రాల నుంచి వచ్చిన వెంటనే దించుకోవాలని, లారీలను తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం రవాణా, దిగుబడి అంశాలపై అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్రాల నిర్వాహకులు రోజువారీగా రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు రవాణా కాంట్రాక్టర్లు సకాలంలో లారీలు సమకూర్చాలని తెలిపారు.

నేడు జాబ్‌మేళా

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఐఈవో శైలజ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీ సంస్థ టెక్‌బీ ప్రోగ్రాం కోసం జాబ్‌మేళా నిర్వహించనుందని పేర్కొన్నారు. 2022–23 ఎంపీసీ, ఎంఈసీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ప్రైవేట్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఆయా కోర్సుల్లో ఓవరాల్ 75శాతం, గణితంలో 60 మార్కులు సాధించిన విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

రేపు డిగ్రీ కళాశాలలో..

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 19న తెలంగాణ స్కిల్, నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో మేజిక్ బస్ సంస్థ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. జాబ్‌మేళాలో 10 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. 2019 నుంచి 2023 సంవత్సరంలో డిగ్రీ పాసైన విద్యార్థులు, డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చలో కొత్తగూడెం

శ్రీరాంపూర్: సింగరేణిలో ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని నిరసిస్తూ జూన్ 4న చలో కొత్తగూడెం నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ.సీతారామయ్య తెలిపారు. బుధవారం ఆయన ఆర్కే 7 గనిపై గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కేంద్రం బొగ్గు బ్లాకులను వేలం వేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం లేదని, ఈ బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచీ సెక్రెటరీ కొట్టె కిషన్‌రావు, నాయకులు గునిగంటి నర్సింగరావు, పీ.రాజేందర్, బీర రవీందర్, మారుపెల్లి సారయ్య, ఆకుల లక్ష్మణ్, దుర్గం బానేశ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



పాలిటెక్నిక్ కాలేజీలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శ్రీరాంపూర్: జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలిసెట్–2023 ప్రశాంతంగా ముగిసిందని పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్‌రావు తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల, నస్పూర్ పట్టణాల్లో తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో 2,232 మందికి గాను 2,119 మంది పరీక్షకు హాజరయ్యారని, 113మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులంతా నిర్ణీత సమయానికే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారని, పరీక్ష నిర్వహణకు సింగరేణి నుంచి అనేక విధాలుగా సహకారం అందించిందని తెలిపారు. సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు ఏ.పోశయ్య కేంద్రాలను పరిశీలించారు. పేపర్ లీకేజీల సంఘటనల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్ష కేంద్రాల్లో 1,376 మంది విద్యార్థులకు 1,298 మంది పరీక్షకు హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులు పరీక్ష రాసినట్లు బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్‌రెడ్డి ప్రకటించారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎన్‌హెచ్ బాధితులు



కేంద్ర మంత్రితో బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–ఆర్మూర్ నాలుగు వరసల జాతీయ రహదారి–63 నిర్మాణ పనుల్లో భాగంగా తమకు జరుగుతున్న నష్టాన్ని గుర్తించి న్యాయం చేయాలని బుధవారం కేంద్ర గిరిజన సంక్షేమ, వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండాను ఎన్‌హెచ్–63 బాధితులు కోరారు. జాతీయ రహదారి విస్తరణతో పొలాలు, భూములు, ఇళ్లు పూర్తిగా కోల్పోయే పరిస్థితులను వివరించారు. ప్రజలకు నష్టం జరగకుండా మరోసారి స్పష్టమైన సర్వే జరిపేలా చూడాలని విన్నవించారు. మంత్రిని కలిసిన వారిలో వొడ్నాల శ్యాం, బొల్లం భీమయ్య, ఇతర బాధితులు ఉన్నారు. కాగా, రహదారి విస్తరణ సర్వే పనులు నిలిపి వేసి తమకు న్యాయం చేయాలని బాధితులు చేపట్టిన నిరసన దీక్ష బుధవారం 14వ రోజుకు చేరింది.

ప్రసవం.. సాధారణం..



ప్రభుత్వాసుపత్రిలో బాలింతలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యతనిస్తోంది. మెజార్టీగా సీ–సెక్షన్(సిజేరియన్) కేసులను తగ్గించి సాధారణ ప్రసవాలు(నార్మల్ డెలివరీ) చేస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది. గత ఏప్రిల్ నెలలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఒక్క సిజేరియన్ కేసు కూడా లేకుండా 45 సాధారణ ప్రసవాలు చేసి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో రికార్డు సృష్టించిన నాలుగు సీహెచ్‌సీల్లో బెల్లంపల్లి సీహెచ్‌సీ ఒకటి కావడం గమనార్హం. మిగతా మూడింటిలో హైదరాబాద్‌లోని శ్రీరాంనగర్, లాలాపేట, కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ సీహెచ్‌సీలు ఉన్నాయి. ఈ విషయాన్ని టీవీవీపీ హెల్త్ సెక్రెటరి రిజ్వీ ఇటీవల స్వయంగా ప్రకటించి ఉత్తమ తీరును కనబర్చిన సీహెచ్‌సీలను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రత్యేక శ్రద్ధ

గర్భిణులు జాగ్రత్తలు పాటించేలా అత్యంత శ్రద్ధతో తీసుకుంటున్న చర్యలు కారణంగా సత్ఫలితాలు వస్తున్నాయి. గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు చేసే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతులు వివరిస్తూ క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారు. మాతాశిశు సంరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యత వల్ల గ్రామీణ ప్రాంతాలకు చెందిన గర్భిణులే కాకుండా పట్టణ ప్రాంతాల గర్భిణులు సైతం సాధారణ ప్రసవాలపై మొగ్గు చూపుతూ మానసికంగా దృఢచిత్తాన్ని అలవర్చుకుంటున్నారు. కత్తి గాట్లు లేకుండా ఇతర ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పండండి బిడ్డకు జన్మనిచ్చి బాలింతలు క్షేమంగా ఇల్లు చేరుతున్నారు. ఈ తీరుతో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్న గర్భిణులు సీహెచ్‌సీ వైపు అడుగులు వేస్తున్నారు. దీంతో సీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది.

బెల్లంపల్లి సీహెచ్‌సీలో ప్రసవాల వివరాలు (ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు)

నెల	ప్రసవాల సంఖ్య	సాధారణం	శస్త్రచికిత్స
జనవరి	27	25	2
ఫిబ్రవరి	27	25	2
మార్చి	48	37	11
ఏప్రిల్	45	45	–
మే 17వరకు	16	15	1

గైనకాలజిస్ట్ ప్రత్యేక శ్రద్ధ

మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి నవమాసాలు నిండే వరకు వైద్య పరీక్షల కోసం రావాల్సి ఉంటుంది. క్రమం తప్పకుండా వైద్య పరీక్షల కోసం వచ్చే వారి ఆరోగ్య పరిస్థితులను గైనకాలజిస్టు, మిడ్ వైఫరీ స్టాఫ్‌నర్సులు తెలుసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. కాన్పు కష్టమయ్యే అవకాశాలు ఉంటే సదరు గర్భిణి, కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా మాట్లాడి సాధారణ ప్రసవానికి గల అవకాశాలను ముందస్తుగా తెలియజేస్తారు. సిజేరియన్ చేయడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించి అవగాహన కల్పిస్తారు. సాధారణ ప్రసవానికి అంగీకరించిన గర్భిణులకు ప్రణాళికబద్ధంగా తేలికపాటి వ్యాయామాలు చేయించడం, ధైర్యం కల్పిస్తుండడం, ఈ విషయంలో మిడ్ వైఫరీలు, మహిళా గైనకాలజిస్టు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండడంతో సాధారణ ప్రసవాలు పెరుగుతున్నాయి. మరోవైపు కేసీఆర్ కిట్ కూడా గర్భిణులను ఆకర్షిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు అయిన వారికి ఆడశిశువు జన్మిస్తే రూ.13వేలు, మగశిశువు జన్మిస్తే రూ.12వేలు చొప్పున ప్రోత్సాహకం అందిస్తుండడం కూడా సత్ఫలితాలు ఇస్తోంది.

సిబ్బంది లేకపోయినా..

కాన్పు చేయడానికి ప్రస్తుతం సీహెచ్‌సీలో తగినంత సిబ్బంది లేరు. గైనకాలజిస్ట్‌కు తోడుగా జనరల్ సర్జన్ అవసరం ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో జనరల్ సర్జన్ అవసరం ఎంతగానో ఉంటుంది. కానీ పోస్టు ఖాళీగా ఉండడంతో గైనకాలజిస్ట్‌పై భారం పడుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ పోస్టు కూడా భర్తీకి నోచుకోవడం లేదు. అవసరమైనప్పుడల్లా మంచిర్యాల నుంచి రప్పిస్తున్నారు. కాగా, 30 పడకల సీహెచ్‌సీ 100 పడకలకు అప్‌గ్రేడ్ అయి ఏరియా ఆసుపత్రిగా రూపాంతరం చెందినా ఇంత వరకు సరిపడా వైద్యులు, సిబ్బంది భర్తీ కాలేదు. అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



నార్మల్ డెలీవరి చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, సిజేరియన్ చేయడం వల్ల తలెత్తే శారీరక, మానసిక సమస్యలను ముందస్తుగానే గర్భిణులకు వివరించి అవగాహన కల్పిస్తున్నాం. కుటుంబ సభ్యులకు వివరించి చెబుతున్నాం. దీంతో గర్భిణులు, కుటుంబీకుల్లో మార్పు వచ్చి నార్మల్ డెలివరికి సహకరిస్తున్నారు. గర్భిణులకు జాగ్రత్తలు తీసుకుని నార్మల్ డెలివరీలు చేసి మాతాశిశు సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా ఉంటున్నారు.

– కిరణ్‌కుమారి, గైనకాలజిస్ట్, సీహెచ్‌సీ బెల్లంపల్లి

నార్మల్ డెలివరీ జేత్తరని అనుకోలె..



మాది బెల్లంపల్లి మున్సిపాలిటీలోని పాతబస్టాండ్ ఏరియా. నిరుపేద కుటుంబం. నేను గర్భం దాల్చినప్పటి నుంచి నెలలు నిండే వరకు ప్రభుత్వాసుపత్రిలో చూపించుకున్న. ప్రతీ నెల పరీక్షలు సుత ఉచితంగానే జేసిండ్లు. కడుపుల ఉన్నబిడ్డ, నేను సుత ఆరోగ్యంగ ఉన్నమని చెప్పిండ్లు. నా భర్త కూలీ పని చేస్తడు. ప్రైవేట్ దవాఖానాకు వెళ్లి కాన్పు చేసుకునే అంత స్థోమత మాకు లేదు. ఉన్నంతల సర్కారు దవాఖాన అయితే సరే అనుకున్నం. పురిటి నొప్పులు మామూలుగా సురు కాంగనే గట్లనే ప్రభుత్వాసుపత్రికి వచ్చి సేరికైనం. ఒకదినం జూసిండ్లు. రెండో రోజు నార్మల్ డెలివరీ జేసిండ్లు. నాకు బిడ్డపుట్టింది. నిజంగా నాకు నార్మల్ కాన్పు అయితదని మాత్రం అనుకోలే. ఇప్పుడు నేను, నా బిడ్డ ఆరోగ్యంగా ఉన్నం. ఆసుపత్రిల తల్లీబిడ్డలను అర్సుకునుడు మంచిగున్నది. చికిత్స సుత మంచిగనేజేత్తండ్లు.

– సల్లూరి అరుణ, పాత బస్టాండ్ ఏరియా, బెల్లంపల్లి

కలెక్టరేట్ ప్రారంభానికి సిద్ధం చేయాలి

• కలెక్టర్ బాదావత్ సంతోష్




కలెక్టరేట్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లో కలెక్టరేట్ నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా శాఖల కార్యాలయాల గదులు, సమావేశ మందిరం, దరఖాస్తుదారులు వేచి ఉండేందుకు ఏర్పాటు చేసిన గది, భవన ఆవరణలో చేపట్టిన మొక్కల పెంపకం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. తాగునీరు, విద్యుత్ సరఫరా పనులను పూర్తి చేయాలని తెలిపారు.

క్రీడా పోటీలు విజయవంతం చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: సీఎం కప్ క్రీడా పోటీలను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 వరకు మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాల్‌బాల్ పోటీలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 22 నుంచి 24 వరకు మందమర్రి మండల రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభ గల క్రీడకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 31 వరకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, రెజ్లింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, హాకీ, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, 15 నుంచి 36 సంవత్సరాల వయసు గల క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 934665441 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం



సిబ్బందితో మాట్లాడుతున్న బృందం సభ్యులు

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అస్యూర్ స్టాండర్స్(ఎన్‌క్యూఏఎస్)బృందం సభ్యులు బుధవారం సందర్శించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు ఇవ్వడానికి ఆరోగ్య కేంద్రాన్ని బృందం వైద్యులు మనోజ్ మిశ్రా, వైశాలి దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఈ నెల 17, 18వ తేదీల్లో ఆస్పత్రిని పరిశీలించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి సిబ్బందితో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. ఓపీ, ఐపీ సేవలు, ప్రసవాలు, సానిటేషన్, బయో–వేస్టేజ్, ఎన్‌హెచ్‌ఎం నిధులు, జాతీయ కార్యక్రమాలు, రోగులకు సేవలు, సౌకర్యాలు(నీరు), అవగహన కార్యక్రమాలు, శుభ్రత, రికార్డు రిజిష్టర్లు పరిశీలించారు. ఆస్పత్రి సేవలపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు జిల్లా మాస్ మీడియా అధికారి మంచిర్యాల వెంకటేశ్వర్ తెలిపారు. డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు, డెప్యూటీ డీఎంహెచ్‌వో విజయ పూర్ణిమ, డాక్టర్ రవికిరణ్, డీపీవో ప్ర శాంతి, ఎన్‌క్యూఏఎస్ కోఆర్డినేటర్లు అల్లాడి శ్రీని వాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డీఈవో సన్మానం



విద్యార్థులు, ఎస్‌వోను సన్మానించిన డీఈవో

మంచిర్యాలఅర్బన్: చెన్నూర్ కేజీబీవీలో ఇంటర్మీడియెట్ చదువుతూ జిల్లా టాపర్లుగా, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన నలుగురు విద్యార్థులను డీఈవో యాదయ్య బుధవారం ఘనంగా సన్మానించారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని రమణీల(ఎంపీసీ) 461 మార్కులతో రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు, సీహెచ్.రజిత(బైపీసీ ఫస్టియర్) 422 మార్కులతో 7వ ర్యాంకు, బి.పూజిత(ఎంపీసీ, ద్వితీయ సంవత్సరం) 981తో రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంకు, కె.అఖిల(ఎంపీసీ, ద్వితీయ) 964తో రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు సాధించగా.. విద్యార్థులతోపాటు ఫలితాల సాధనకు కృషి చేసిన స్పెషల్ ఆఫీసర్ ఏ.సుమలతను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సెక్టోరల్ అధికారుల పద్మజా, చౌదరి, శ్రీనివాస్, ఎఫ్ఏవో సప్తర్ అలీఖాన్, కేజీబీవీ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగులు భద్రతతో పనిచేయాలి


ప్రతిజ్ఞ చేస్తున్న ఆపరేటర్లు

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఉద్యోగులు భద్రతతో పనిచేయాలని శ్రీరాంపూర్ ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం గనిపై వాహనాల డ్రైవర్లు, ఆపరేటర్ల భద్రత అవగాహన పక్షోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఓసీపీల్లో భారీ వాహనాలు, పెద్ద యంత్రాలు నడుస్తాయి కాబట్టి వాటికి తగ్గట్లుగా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వాహనాలకు మధ్య 50 మీటర్ల దూరం ఉండేలా నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓసీపీ మేనేజర్ సుధీర్ జక్కులవార్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షులు డీ.అన్నయ్య, మంద మల్లారెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి శంకర్, అధికారుల సంఘం ప్రతినిధి శ్యాంసుందర్, పిట్ సెక్రెటరీ కందుల శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

వాంకిడి(ఆసిఫాబాద్): నకిలీ పత్తి విత్తనాల కేసుల్లో ఇద్దరిని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. గతంలో మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం తుకారాం, సీడం ప్రకాష్ నకిలీ పత్తి విత్తనాలు రవాణ చేస్తూ పట్టుబడ్డారు. పత్తి సీజన్ సమీపిస్తున్నందు వల్ల మళ్లీ అక్రమ దందాలకు పాల్పడకుండా ఉండేందుకు ముందస్తుగా వారిని బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు రైతు మృతి



మొగిల్ల బాపు (ఫైల్)

కోటపల్లి(చెన్నూర్): పాముకాటుకు రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని నక్కలపల్లి గ్రామానికి చెందిన మొగిల్ల బాపు గ్రామంలో ఐదెకరాల భూమి కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. అటవీప్రాంతానికి సమీపంలో పొలం ఉండడంతో అడవిపందుల బారి నుంచి పంటను రక్షించుకునేందుకు రాత్రిపూట కాపలాగా వెళ్తున్నాడు. మంగళవారం రాత్రి పంటచేల వద్ద పడుకున్న సమయంలో కాలుకు పాము కాటువేసింది. ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు విషయం తెలపడంతో అంబులెన్స్‌లో ముందుగా చెన్నూర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో ఒకరు మృతి

కాగజ్‌నగర్‌టౌన్: వడదెబ్బతో ఒకరు మృతి చెందిన ఘటన కాగజ్‌నగర్ పట్టణంలోని సంజీవయ్య కాలనీలో చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఇగురపు ఈశ్వర్ (30) వెల్డింగ్ షాపులో కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం రోజులాగే పనికి వెళ్లి వచ్చి రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మూగజీవాలు విలవిల


మండుతున్న ఎండలతో చెట్ల నీడన చేరిన మేకలు



మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడు భగభగ మండుతున్నాడు. రోజురోజుకు పెరుగుతున్న ఎండలు, వడగాలులకు మనుషులతో పాటు మూగజీవాలు అల్లాడుతున్నాయి. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు నమోదవుతున్నాయి. పాడిపశువులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు, కుక్కలు, ఇతర జీవాలు వేసవితాపంతో అవస్థలు పడుతున్నాయి. వేసవిలో పాడిపశువులు, మూగజీవాల పెంపకందారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ వై.రమేశ్‌కుమార్ వివరించారు.

- చెట్ల నీడన, నీటిమడుగుల్లో ఉపశమనం
- ఎండ దెబ్బతగిలి మృత్యువాత పడే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు


ఎండల తీవ్రతతో నీటి మడుగులో ఉపశమనం పొందుతున్న గేదెలు

పెంపుడు జంతువులను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు తీసుకెళ్లాలి. కొట్టాల చుట్టూ తట్టుబొంతలు కట్టి నీటితో తడిపితే వడగాలుల ప్రభావం తాకదు. పచ్చిమేత, తడిపిన దాణా ఇవ్వడం మంచిది. పశువుకు రోజుకు సుమారు 50 నుంచి 60 లీటర్ల నీటిని తాగించాలి. దాణాతో పాటు లవణ మిశ్రమం, పుష్కలంగా తాగునీరు ఇవ్వడం వల్ల తొందరగా డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడుకోవచ్చు. వడదెబ్బకు గురైన పశువులు, ఇతర జీవాల శరీర ఉష్ణోగ్రత పెరిగి, నోరు తెరిచి భారంగా శ్వాసతీస్తూ అటూఇటు ఊగుతూ బాధపడుతాయి. అలాంటి పశువులను వెంటనే తల, శరీరభాగాలను నీటితో తడుపుతూ నీడపట్టున ఉంచి సమీపంలోని పశువైద్యాధికారికి చూపించి చికిత్స అందించాలి.

వేసవిలో సోకే వ్యాధులు

వేసవిలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు ఎక్కువగా వస్తాయి. గొంతువాపు ఓ అంటువ్యాధి. వ్యాధి సంక్రమించిన పశువులు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కోవడం వల్ల గురక లాంటి శబ్దం వస్తుంది. అందుకే దీనిని గురక వ్యాధి అని కూడా అంటారు. ముఖ్యంగా 6 నెలల నుంచి 2 సంవత్సరాల వయస్సు ఉన్న పశువులకు ఎక్కువగా సోకుతుంది. పశ్చరుల్లా మల్టోసిడా అనే బాక్టీరియా వల్ల గొంతువాపు వ్యాధి సోకుతుంది. వాతావరణం చల్లగా ఉండి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, వేసవిలో మేత లేక, వాతావరణంలో ఆకస్మిక మార్పులు సంభవించినప్పుడు, సుదూర ప్రయాణాలు చేసినప్పుడు ఈ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

వేడిగాలుల నుంచి కోళ్లకు రక్షణ..

కోళ్లకు వడదెబ్బ తగలకుండా ఉండాలంటే షెడ్డు మీద గడ్డి, తాటాకులు లేదా కొబ్బరి మట్టల్ని కప్పాలి. దీనివల్ల షెడ్డు లోపలి ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు తగ్గుతాయి. కోళ్ల ఫారం లోకి గాలి ధారళంగా ప్రసరించేలా చూడాలి. అవసరమైతే ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. షెడ్డు పై భాగంలో స్ప్రింక్లర్లతోనూ ఫాగర్ల వంటి పరికరాలతోనూ నీటి తుంపర్లు పడేలా చూడాలి. కోళ్లకు ఎలక్ట్రోలైట్లను అందించాలి. కోళ్లఫారం చుట్టూ నీడనిచ్చే చెట్లు పెంచడం మంచిది. కోళ్లు వడదెబ్బకు గురైతే వాటిని తల మునగకుండా మిగిలిన శరీరాన్ని చల్లటి నీటిలో ముంచి తీయాలి. దీనివల్ల కోడి శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుతుంది.

కోళ్లకు సోకే వ్యాధులు

కొక్కెర

కోళ్లకు వచ్చే వ్యాధుల్లో అత్యంత భయంకరమైనది కొక్కెర. వ్యాధి సోకిన కోడి ముడుచుకుని ఉంటూ రెక్కల్ని వేలాడేస్తుంది. పక్షవాతపు లక్షణాలు కనిపిస్తాయి. మెడ వెనక్కి వాలుతుంది. తెలుపు, ఆకుపచ్చ రంగులో విరేచనాలు అవుతాయి. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుంది. కోడి శరీరంలోని కొన్ని భాగాల్లో సన్నని రక్తపు చుక్కలు కనిపిస్తాయి. వ్యాధి నివారణకు మందులేవి లేవు. కాబట్టి ఈ వ్యాధి రాకుండా కోళ్లకు ముందుగానే టీకాలు వేయించాలి.

గంబోరో

బాయిలర్ కోడిపిల్లలు వారం నుంచి రెండు నెలల వయసు వచ్చే వరకు గంబోరో వ్యాధికి ఎక్కువగా గురవుతాయి. నీళ్ల విరేచనాలు అవుతాయి. సరిగా నిలబడలేవు. వణుకుతాయి. వ్యాధి సోకిన కోడి పిల్లల్ని వెంటనే ఇతర కోళ్ల నుంచి వేరుచేయాలి. నీటిలో యాంటి బయాటిక్స్ విటమిన్లు కలిపి ఇస్తే కొంత ఉపశమనం లభిస్తుంది. వ్యాధి నివారణకు 10 నుంచి 14 రోజుల వయసులో టీకాలు వేయించాలి.

కోరైజా

ఈ వ్యాధి సోకిన కోడిపిల్లలు మేత, నీటిని సరిగా తీసుకోలేక బరువు కోల్పోతాయి. ముక్కు, కండ్లు ఉబ్బి, తెల్లని చీము గడ్డల మాదిరిగా తయారవుతాయి. పశువైద్యుల సలహా మేరకు కోడిపిల్లలకు వారం రోజుల పాటు యాంటిబయాటిక్స్, విటమిన్లు అందిస్తే వ్యాధి పూర్తిగా నయమవుతుంది.

తగిన సమయంలోనే నీరు, దాణా..

కిలో బరువు దాటిన కోళ్లకు ఉదయం 10 నుంచి సాయత్రం 4 గంటల వరకు దాణా ఇవ్వకూడదు. సాయత్రం వేళ దాణా కొంచెం తడిపి ఇవ్వడం మంచిది. దాణాలో క్రమం తప్పకుండా టాక్సిన్ బైండర్లను కలపాలి. ఎనర్జీ శాతం తక్కువగా ప్రొటీన్ల పరిమాణం తగుమోతాదులో ఉండేలా చూడాలి. టన్నుదాణాకు 200 గ్రాముల విటమిన్ (సి)ని తగిన మోతాదులో సోడా ఉప్పును కలిపితే వడదెబ్బ బారినుంచి కాపాడుకోవచ్చు. వాటికి అందించే నీటిలో విధిగా శానిటైజర్లను కలపాలి. డీప్ లిట్టర్‌లో కోళ్లను పెంచే వారు ఎక్కువ నీటిగిన్నెల్ని ఏర్పాటు చేయాలి. చల్లని నీటిని అందుబాటులో ఉంచాలి. కోడి పిల్లలకు చల్లని నీటిలో ఎలక్ట్రోలైట్లను కలిపి ఇవ్వడం ద్వారా డీహైడ్రేషన్ సమస్య నివారించవచ్చు.

యువకుడి ఆత్మహత్యకు కారకులపై కేసు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన నలిమెల వినయ్ (24) ఈ నెల 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన విషయం తెలిసిందే. అతని ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుని తల్లి నలిమెల బుచ్చవ్వ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంబడి రాజలింగు, రాజమణి, నర్సయ్య, నిష్యాంత్‌తో పాటు చుంచు శ్రీనివాస్, సునీత, ఎంబడి వెంకటేశ్, నలిమెల మహేష్, పత్తిపాక సంతోష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

ఓసీపీల్లో షిఫ్టు వేళలు మార్చాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్(చెన్నూర్): వేసవికాలంలో మండుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ఓపెన్ కాస్ట్ గనిలో షిఫ్టు వేళలు మార్చాలని ఏఐటీయూసీ నాయకులు బుధవారం ఆర్‌కేపీ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఆప్రభావం కార్మికులపై పడే అవకాశం ఉందని, అందుకే పనివేళలు మార్చాలన్నారు. కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేయాలని డంపర్లు, ఇతర మిషనరీల ఏసీలు పనిచేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అక్బర్అలీ, నాయకులు ఇప్పకాయల లింగయ్య, అంజనేయులు, రాజేశ్వర్‌రావు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


లాల్‌ప్రసాద్

చెన్నూర్: పట్టణంలోని కొత్తగూడెం కాలనీలో నివాసం ఉంటున్న నీలం లాల్‌ప్రసాద్ (35) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం కుటుంబ సభ్యులు అట్టెం మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. లాల్ ప్రసాద్ ఆచూకీ తెలిస్తే చెన్నూర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ వాసుదేవరావు తెలిపారు.

రెవెన్యూ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు

- 200 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న రాయితీ బియ్యం

కాగజ్‌నగర్‌టౌన్: రెవెన్యూ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం పట్టణంలో చేపట్టిన తనిఖీల్లో రైల్వేస్టేషన్ ప్రాంతంలో 200 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు జిల్లా ఇన్‌చార్జి పౌరసరఫరాల అధికారి కె.తారామణి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్యాంలాల్, డి.శ్రీనివాస్, రాజ్‌కుమార్, కాగజ్‌నగర్ తహసీల్దార్ మునవ్వర్ షరీఫ్ ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించగా ఓ గుడిసెలో పెద్ద ఎత్తున నిల్వ ఉన్న రాయితీ బియ్యం సంచులతో పాటు రెండు మినీ వ్యాన్లలో రవాణాకు సిద్ధంగా ఉన్న బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బియ్యం నిల్వ చేసిన రాజిక్, వ్యాన్ డ్రైవర్లు రాజేశం, ఎండీ అఫ్జల్‌ను అదుపులోకి తీసుకున్నారు. మంచిర్యాల, కుమురంభీం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చి కాగజ్‌నగర్‌లో నిల్వ చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో అధికారులు తేల్చారు. పట్టుకున్న బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములకు తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం పరిశీలించారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి


మృతి చెందిన గేదె వద్ద తిరుపతి

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చాకేపల్లిలో విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. గ్రామంలోని బియ్యాల తిరుపతికి చెందిన రెండు గేదెలు బుధవారం ఉదయం మేత కోసం బయటకు వెళ్లి గ్రామ శివారులో మేస్తుండగా విద్యుత్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. మృతి చెందిన గేదెలను పశువైద్య సిబ్బంది పరిశీలించారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య


జాడి ఇస్తారి మృతదేహం

తిర్యాణి(ఆసిఫాబాద్): కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సుంగాపూర్‌లో చోటు చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన జాడి ఇస్తారి (43)కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బుధవారం కుటుంబ సభ్యులు కైరిగూడ గ్రామ శివారులోని పంటపొలాల వైపు వెళ్లి చూడగా తన చేనులో విగతజీవిగా పడి ఉన్నాడు. గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని సోదరుడు జాడి అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అకౌంట్లలో డబ్బులు మాయం?

తిర్యాణి: ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇస్తామని నమ్మబలికి ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టం ద్వారా మండలంలోని ఎదులపహడ్, కన్నెపెల్లి, ఇర్కపెల్లి గ్రామాలకు చెందిన పలువురి అకౌంట్ల నుంచి ఓ వ్యక్తి డబ్బులు మాయం చేసినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. బెల్లంపల్లికి చెందిన సదరు వ్యక్తి ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డుకు దరఖాస్తు చేస్తామంటూ మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించాడు. వేలిముద్ర వేయాలని చెప్పి ఆధార్ బేస్డ్ ద్వారా సంబంధింత అకౌంట్ల నుంచి రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు ఇతర అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో పాటుగా పేమెంట్ ట్రాన్స్‌ఫర్ అయిన సమయంలో బ్యాంకు నుంచి వినియోగదారుడి మొబైల్‌కు వచ్చిన మెసేజ్‌ను సైతం సదరు వ్యక్తి డిలిట్ చేసినట్లుగా పలువురు ఆరోపిస్తున్నారు. గురువారం బ్యాంకు స్టేట్‌మెంట్ ద్వారా ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. ఈ విషయమై ఎస్సై రమేశ్‌ను వివరణ కోరగా డబ్బులు మాయం అయినట్లు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

జైపూర్: ఇందారం ఐకే1ఏ గనిపై బుధవారం గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకే1ఏ, ఐకే–ఓసీపీ పీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి నిర్ణీత మస్టర్లు తప్పనిసగా పూర్తి చేయాలన్నారు. విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి విధులకు హాజరు కాకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. డ్యూటీ చేయడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యక్తి గత పనులు, అనారోగ్య సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా గైర్హాజరు కార్మికులు క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలని సూచించారు. ఆపరేషన్స్ మేనేజర్ బ్రహ్మాజీరావు, ప్రాజెక్టు ఇంజనీర్ రమేశ్, సంక్షేమాధికారి గౌస్‌పాషా పాల్గొన్నారు.

డిగ్రీ 4, 6 సెమిస్టర్ల పరీక్షలు వాయిదా

- ఎండల నేపథ్యంలో పలువురి విజ్ఞప్తి మేరకు నిర్ణయం
- జూన్ 13 నుంచి పరీక్షలు


పరీక్షలు వాయిదా వేయాలని వీసీని కోరుతున్న లెక్చరర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పలు సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, ఒకేషనల్, బీసీఏ, బీఏ(ఎల్) పీడీసీ కోర్సుల 4, 6వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ మధుకర్, డాక్టర్ నరేందర్ బుధవారం వెల్లడించారు. జూన్ 13 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేయూ పరిధిలో డిగ్రీ 4, 6వ సెమిస్టర్ల పరీక్షలు కీలకమైనవి. మే నెలలోనే నిర్వహించాలనే విధంగా రెండు మూడుసార్లు టైం టేబుల్ షెడ్యూల్స్‌ను విడుదల చేసిన పరీక్షల విభాగం అధికారులు వివిధ కారణాలతో ముఖ్యంగా వివిధ సెట్ల పరీక్షలు ఉండడంతో వాయిదా వేస్తూ వచ్చారు. చివరికి ఈ నెల 22 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని టైం టేబుల్ విడుదల చేశారు. ఈ షెడ్యూల్‌ను ప్రకటించాక వేసవిలో ఎండలు మండిపోతున్నాయని, తమకు ఇబ్బంది అని పరీక్షల విధులను నిర్వహించాల్సిన వివిధ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరీక్షల విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. హనమకొండ, వరంగల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలకు చెందిన పలువురు మహిళా అధ్యాపకులు బుధవారం వీసీ ఆచార్య తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డిని కలిసి డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని విన్నవించారు.

ఆలస్యమైతే ఫలితాలపై ప్రభావం

డిగ్రీ కోర్సుల విద్యార్థులకు 6వ సెమిస్టర్ పరీక్షలు కీలకమైనవి. ఈ పరీక్షలు మే, జూన్‌లో పూర్తయితేనే ఫలితాలు సకాలంలో వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పుడు జూన్, జూలైలో జరగబోతున్నందువల్ల ఫలితాలపై ప్రభావం చూపనుందని భావిస్తున్నారు. ఎందుకంటే డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ పరీక్షలతో కోర్సు పూర్తయితే ఉన్నత విద్య ఇతర కోర్సుల్లోకి ప్రవేశాలకు అవకాశం కలుగుతుంది. ఉన్నత విద్యలోని పీజీతోపాటు వివిధ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశపరీక్షలు అన్ని మే నెలలోనే జరగబోతున్నాయి. వాటి ఫలితాలు వచ్చేలోగా డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షలు పూర్తిచేసి ఫలితాలను సకాలంలో ఇస్తేనే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లేదంటే విద్యార్థులు ఇబ్బంది పడే అవకాశం లేకపోలేదు.

మార్కులు తక్కువ వచ్చాయని విద్యార్థిని ఆత్మహత్య


అజ్మీర వైష్ణవి(ఫైల్)

సిర్పూర్(టి): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయని మనస్తాపం చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. కుమురంభీం జిల్లా సిర్పూర్(టి) ఎస్సై డికొండ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్(టి) మండలం చింతకుంట గ్రామానికి చెందిన అజ్మీర ఆలునాయక్ కూతురు అజ్మీర వైష్ణవి(18) ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో తన తోటి విద్యార్థినుల కంటే తక్కువ మార్కులు వచ్చాయని తీవ్ర మనస్తాపానికి గురై మౌనంగా ఉంటోంది. మంగళవారం తల్లిదండ్రులు బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం రాత్రి వైష్ణవి పురుగుల మందు తాగింది. వైష్ణవి సోదరి, బంధువులు ఆమెను కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలి

జైపూర్: పర్యావరణానికి ప్లాస్టిక్ తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తోందని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని సాధ్యమైనంతవరకు నిర్మూలించాలని ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్ తెలిపారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో మిషన్ లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంటు అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీటీసీ సంజయ్‌కుమార్ సూర్ మాట్లాడారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా వినియోగాన్ని తగ్గించాలన్నారు. పర్యావణం మూలంగా కలిగే నష్టాలను వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీఎం సూర్యనారాయణ రాజు, ఏజీఎం సుధాకర్, డీజీఎం సత్యనారాయణప్రసాద్, శివప్రసాద్, వాసుదేవమూర్తి, డీజీఎం పర్సనల్ కేసా నారాయణరావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు చుక్కల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓసీపీ బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో పనిచేసే ఓవర్‌మెన్లు, హెడ్ ఓవర్‌మెన్లు ఓసీపీలకు బదిలీపై వెళ్లడానికి గురువారం వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలోని వారికి శ్రీరాంపూర్ వీటీసీలో ఈ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈ కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

క్వార్టర్లకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని సీ2 క్వార్టర్లకు బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 16 మందికి క్వార్టర్లు కేటాయించినట్లు డీజీఎం(పర్సనల్) అరవిందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఈఈ గుండెరావు, డెప్యూటీ పీఎం రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.